# సంస్కారానికి గీటురాయి!

**జొన్నలగడ్డ రామలక్ష్మి**

రామారావు, భ్రమరాంబల గారాల పుత్రిక వనజ. అలాగని ఆమె ఆ దంపతుల ఏకైక పుత్రికకాదు. రామారావుగారికి వనజ కాక ఇద్దరబ్బాయిలూ, ఇద్దరమ్మాయిలూ ఉన్నారు. ఆయనకు నాల్గవ సంతానం అయిన సరితకు పదేళ్ళవయసుండగా భ్రమరాంబ వనజను కన్నది. ఇంటిల్లపాదీ వనజను గారం చేస్తున్నారంటే అదే కారణం!

వనజ యిప్పుడు బీయస్సీ రెండవ సంవత్సరం చదువుతోంది. అయినా యిప్పటికీ ఆమెకు జడ వేసుకోవడం కూడా తిన్నగారాదు. ఇంక వంట సంగతి చెప్పనే అక్కర్లేదు. డైనింగ్ టేబుల్ మీద అన్నీ సిద్ధంగా ఉన్నా వడ్డించుకుని తినదామె. కుర్చీలో కూర్చుని తల్లిని పిలుస్తుంది.

అలాగని వనజను బద్ధకిష్టి అనుకుందుకులేదు. ఆమెవి స్వతంత్ర భావాలు. ఇది మారుతున్న కాలమంటుందామె. "ఈ కాలంలో ఆడవాళ్ళూ, మగవాళ్ళూ ఒకేరకం జీవితం గడుపుతారు. ఆడది పెళ్ళిచేసుకున్నాక వంటగదికి పరిమితంకావాలన్న సిద్ధాంతమేముంది? అవసరాన్ని బట్టి ఆడా, మగా-ఇద్దరిలో ఎవరైనా వంట చేయాల్సి వస్తుంది. అటువంటప్పుడిద్దరిలో ఆడది మాత్రమే ఎందుకు ముందుగా వంట నేర్చుకోవాలి?

"ఏ యింట్లోనైనాసరే ఆడపిల్లా, మగపిల్లాడూ ఒకేవిధంగా పెరగాలి. చిన్నప్పట్నించీ ఆమెను వంటింటికి సిద్ధంచేస్తూ పెంచకూడదు. స్త్రీ పురుషుల సమానత్వం - ఇంట్లో తలిదండ్రుల పెంపకంలో ప్రారంభంకావాలి."

ఇప్పుడు వనజ అక్కలిద్దరూ పెళ్ళిళ్ళై అత్తవారిళ్ళకు వెళ్ళిపోయారు. అన్నలిద్దరూ కూడా ఉద్యోగరీత్యా వేరే ఊళ్ళలో ఉన్నారు. వాళ్ళకూ పెళ్ళిళ్ళైపోయాయి. ఇప్పుడాయింట్లో ఉండేది వనజ, ఆమె తలిదండ్రులు.

ఎప్పుడైనా వనజ తల్లి భ్రమరాంబ "వనజా, కంచాలు పెట్టుతల్లీ భోంచేద్దాం." అని చిన్న కేక వేసినా రామారావుగారు "దానికి పని చెబుతావా?" అని దెబ్బలాడేవారు. భ్రమరాంబకెప్పుడైనా జ్వరంవస్తే వనజ తండ్రినే చేయమని ఆయన చేస్తూంటే తను సాయంచేసేది.

వయసు పెరుగుతున్న కొద్దీ వనజలో స్త్రీల గురించిన విప్లవభావాలధికమయ్యాయి. "సమాజంలో స్త్రీకి ఉండవలసిన స్థానంలేదు. ఉండవలసినంత గౌరవంలేదు. స్త్రీ లేనిదే ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేని సమాజం అడుగడుగునా స్త్రీని ఏదోవిధంగా చిన్నబుచ్చుతూనే ఉంటుంది.



అందుకు స్త్రీ కూడా సహకరిస్తోంది. ఈ పద్ధతి మారాలి. ఇందుకు ఉడతాభక్తిగా నేను చేయగలిగినది ప్రస్తుతానికి ఒక్కటే.... పూర్తిగా మగపిల్లవాడిలా పెరగడం...." అంటూండేదామె.

ఇలా పెరుగుతున్న వనజకు బీయస్సీ పూర్తి కాగానే పెళ్ళి చేసేయాలని తలిదండ్రుల తాపత్రయం.

" దీన్నెవడైనా చేసుకుంటాడా ?" అని భ్రమరాంబ బాధపడేది. అందుకు బదులుగా వనజ "నన్నెవడైనా చేసుకుంటానని ముందుకు వస్తే చాలదు. వాడు నాకు నచ్చాలి" అని తలిదండ్రులకు స్పష్టం చేసింది.

"అన్నివిధాలా నువ్విష్టపడ్డవాడితోనే నీ పెళ్ళి జరుగుతుంది తల్లీ!" అని రామారావామెకు మాటిచ్చాడు.

ఇలాంటి పరిస్థితుల్లో రామారావుగారింట్లో రవికాంత్ ప్రవేశించాడు. అతడు ఎమ్మెస్సీ ఫైనలియర్ చదువుతున్నాడు. ఇంట్లో జనాభాలేక నిండుగాలేదనీ, రవికాంత్ తమకు దూరపు బంధువుల కుర్రాడనీ తెలిసి రామారావతడికి తనింట్లో ఓ గది అద్దెకిచ్చాడు. వచ్చిన వారం రోజుల్లోనే రవికాంత్ ఆ దంపతుల హృదయాల్లో స్థానం సంపాదించేశాడు. అతడు వనజకు తగిన వరుడనిపించేక రామారావు అతడి గురించి వనజనభిప్రాయమడిగాడు. వనజ సిగ్గుపడింది.

"ఫరవాలేదు. నీకొక్కవలసినంత టైము తీసుకో నీకు నచ్చితే అతడి పెద్దలను సంప్రదిస్తాను" అన్నాడు రామారావు.

అప్పట్నించీ రవికాంత్‌ని శ్రద్ధగా గమనించ సాగింది వనజ. ఎప్పుడైనా సాయంత్రాలు ఆరుబయట ఇంట్లోని నలుగురూ కుర్చీలు వేసుకుని కూర్చుని కబుర్లు చెప్పుకునేవారు. వనజ, రవికాంత్‌లు మాత్రమే ఉన్నప్పుడు వారి కబుర్లు సాహిత్యానికీ, చదువుకూ పరిమితమై ఉండేవి. సాధారణంగా ఆదివారాలు రవికాంత్‌ని భ్రమరాంబ భోజనానికి పిలిచేది. నలుగురూ కలిసి అప్పుడప్పుడు సినిమాలకు కూడా వెడుతూండేవారు. చెప్పాలంటే వాళ్ళు నలుగురూ ఒక కుటుంబంలోని మనుషుల్లా కలసి ఉండేవారు.

ఇలా ఉండగా వనజ పెద్దక్క లక్ష్మి పుట్టింటికి

వచ్చింది. ఆ సాయంత్రం వనజ, పెద్దక్క ఆరుబయట కుర్చీల్లో కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. అలవాటు ప్రకారం అటు వచ్చిన రవికాంత్ లక్ష్మిని చూసి వెనుదిరిగాడు.

"వెళ్ళిపోతారేం — రండి" అని పిలిపించింది వనజ. అతడు మొహమాటపడుతూంటే లక్ష్మి కూడా పిలిచింది. రవికాంత్ ఇబ్బంది పడుతూ అక్కడకు వచ్చి కూర్చున్నాడు. లక్ష్మి ఆ కబురూ ఈ కబురూ చెబుతూ అతడి కుటుంబ విషయాలన్నీ ఆరా తీసింది.

వాళ్ళు మొత్తం ఇద్దరన్నదమ్ములు. ఇద్దరికీ ఓ అక్క ఉంది. అక్క అదృష్టవంతురాలు. ఇద్దరూ కొడుకులే; అన్నయ్యకి పాపం ఇద్దరూ కూతుళ్ళే!

రవికాంత్‌వి విశాల భావాలు. అతడికి ఆడదంటే గౌరవముంది. కట్నం తీసుకోకూడదన్న భావన ఉంది. అందుకే తన కాళ్ళ మీద తను నిలబడే వరకూ పెళ్ళి కూడా చేసుకోకూడదనుకుంటున్నాడు.

వనజ అతడి భావాలను మెచ్చుకుంది.

లక్ష్మి అతడికి వనజ ఆదర్శాలను వివరించి — "మా యింట్లో అందరికీ యిదంటే గారం, చాలామందికి దీని పద్ధతులవల్ల - పెళ్ళి కాదనీ, అయినా అత్తింట్లో గొడవలు వస్తాయనీ అనుమానం. ఒక ఆధునిక యువకుడిగా మీ అభిప్రాయమేమిటి?" అనడిగింది.

తన అభిప్రాయాన్ని చెప్పడానికి రవికాంత్ ఒక్క క్షణంపాటు మొహమాటపడి "ఒక్క ముక్కలో చెప్పాలంటే వనజవంటి అమ్మాయిని చేసుకోవడంకోసం నేనైతే తలిదండ్రులనైనా ఎదిరిస్తాను" అన్నాడు.

అతడు వనజ నభిమానిస్తున్నాడని లక్ష్మికి అర్థమైంది. అంతకంటే సూటిగా ఎవరు మాత్రం చెబుతారు?

రవికాంత్ వెళ్ళిపోయాక లక్ష్మి ఉత్సాహంగా — "అమ్మా, నాన్నా ఇక్కడి అభిప్రాయం తెలుసుకుందుకు మొహమాటపడుతున్నారు. నాకిప్పుడంతా తెలిసిపోయింది. సినిమా హీరో లాంటి కుర్రాడు. నువ్వదృష్టవంతురాలివే వనజా!" అంది.

వనజ ముక్తసరిగా — "నీ అభిప్రాయ మేమిటో నాకు తెలియదు. రవికాంత్ గురించి నాన్నగారు నా అభిప్రాయమడిగారు. టైము కావాలన్నాను. ఆయన మళ్ళీ అడగలేదనీ ఊరుకున్నాను కానీ రవికాంత్ నచ్చలేదని ఎప్పుడో చెప్పేదాన్ని...." అంది.

లక్ష్మి తెల్లబోయి — "అందానికి అందం. చదువుకు చదువు. ఆస్తికి ఆస్తి. సంస్కారానికి సంస్కారం. అపైన నీ పద్ధతులంటే గౌరవం. ఇంతకు మించిన వరుడు నీ కెక్కడ దొరుకుతాడే? అసలు నీకు పెళ్ళిచేసుకునే ఉద్దేశ్యముందా?" అంది.

"అక్కా! నీకు తెనాలి రామలింగడి కథ తెలుసుగా.... ఒక నర్తకి అన్ని భాషల్లోనూ అనర్గళంగా మాట్లాడుతూంటే ఆమె మాతృభాష తెలుసుకుందుకతడామె కాలు తొక్కాడు. ఆ నర్తకి అప్రయత్నంగా మాతృభాషలో తన బాధను ప్రకటించింది. అలాగే ప్రతిమగాడి అసలు రంగునూ తెలుసుకుందుకు నాకూ ఓ ట్రిక్ తెలుసు. రవికాంత్‌కు నా అందం, మన సంప్రదాయం నచ్చి — మిగతావాటి గురించి ఆలోచించడం లేదు తప్పితే — అతడు నువ్వనుకున్నంత సంస్కారి కాడు" అంది వనజ.

లక్ష్మి ఈ విషయం ఇంట్లో చెప్పింది. అప్పుడు రామారావు గారి కింకో అనుమానం వచ్చింది. రవికాంత్ వంటివాడిని కాదన్నదంటే అప్పటికే ఆమె ఎవరినైనా ప్రేమించిందేమోనని!

"నీ తెలివి మీద, అభిప్రాయాల మీద నాకు నమ్మకముంది. అందుకే రవికాంత్‌ని నువ్వు కాదన్నా నే నొక్కించడం లేదు. నీ మనసులో ఎవరైనా ఉంటే చెప్పు తల్లీ!" అన్నాడు రామారావు.

"తప్పకుండా చెబుతాను, ఎవరైనా ఉన్నప్పుడు!" అంది వనజ.

బి.యస్సీ ఫైనలియర్ పరీక్షలు రాసి సెలవుల్లో చిన్నక్కగారింటి కెళ్ళి కొన్నాళ్ళుండి వచ్చింది వనజ. ఆమె తిరిగి వచ్చేసరికి ఇంట్లో రవికాంత్ లేడు. ఆ స్థానంలో నరేంద్ర ఉన్నాడు.

"అమ్మా-అతడెవరు? రవికాంత్ బంధువా?" అనడిగింది వనజ తల్లిని కుతూహలంగా.

"లేదమ్మా-రవికాంత్ పరీక్షలు కాగానే వెళ్ళిపోయాడు. రిజల్ట్సు వచ్చాక వాళ్ళ వాళ్ళొప్పుకుంటే మళ్ళీ రీసెర్చికి వస్తానన్నాడు. తను వచ్చేసరికి ఈ గదిలో ఎవరున్నా ఖాళీ చేయించి మరీ తనకే యివ్వాలని చెప్పి మరీ వెళ్ళాడు...." అంది భ్రమరాంబ.

"మరి ఇంతల్లో ఏం కొంపలు మునిగిపోయాయని అతడికిచ్చేశారు? నాలుగైదు నెలలు అద్దె రాకపోయినా ఇబ్బందేమీ లేదుగా!" అంది వనజ.

"ఇతడికి అద్దెకివ్వ లేదమ్మా — ఇతడి పేరు నరేంద్ర. నరేంద్ర ముత్తాతగారూ, మా తాతగారూ అన్నదమ్ములు. నరేంద్ర తాతగారూ, మా నాన్నగారూ ఒకే ఊళ్ళో ఉండేవారు. మా రెండు కుటుంబాలూ బాగా కలిసిమెలిసి ఉండేవి. అయితే చాలాకాలంగా రాకపోకలు లేవు. కుటుంబ సభ్యులందరూ పెద్దవాళ్ళై-ఉద్యోగాలు, పెళ్ళిళ్ళు పేర్లు చెప్పి చెట్టుకొకరు, పుట్టకొకరుగా అయిపోయాం. నరేంద్ర తండ్రి నీకు మామయ్యవుతాడు. వాళ్ళకు చాలా వ్యాపారాలున్నాయి. తండ్రి ఏదో వ్యాపారపు పనిమీద కొడుకునిక్కడకు పంపిస్తూ మనింటి అడ్రసిచ్చాడు. నరేంద్ర ఇక్కడ రెండు మూడు నెలలుంటాడు. భోజనం కూడా మనింట్లోనే!" అంది భ్రమరాంబ.

ఆ రాత్రి భోజనాల సమయంలో నరేంద్రని పరిచయం చేశారు వనజకి రామారావు. నరేంద్ర కలుపుగోలు మనిషి. అతడప్పుడే వనజ తలిదండ్రులను అత్తయ్య, మామయ్య అని చనువుగా పిలుస్తున్నాడు.

వనజతో నరేంద్ర — "వనజా! నేను నిన్ను నువ్వనే అంటాను. అంతమాత్రాన కుసంస్కారి అనుకోకు. నువ్వు నా కంటె చిన్నదానివి. అటుపైన నీ తలిదండ్రుల్ని నువ్వంటూ నిన్ను మీరని సంబోధించలేను...." అన్నాడు.

రామారావు, భ్రమరాంబ అతడి చనువుకు సంతోషించారు. వనజకు మాత్రం అతడి చొరవ బొత్తిగా నచ్చలేదు. ఎబ్బెట్టుగా ఫీలయినా మర్యాదగా ఉండదని పైకి ఏమీ అనలేదు.

నరేంద్ర ఎక్కువగా బిజినెస్ పనులమీద తిరిగేవాడు. పగలెక్కడో భోంచేసేవాడు. రాత్రిమాత్రం కాస్త ఆలస్యంగా వచ్చినా ఇంట్లోనే భోంచేసేవాడు. ఇంట్లోవాళ్ళు తనకోసం ఎదురుచూస్తూంటారని సాధారణంగా ఎనిమిది కాకుండానే రాత్రికి ఇల్లు చేరుకునేవాడు.

వనజకు, నరేంద్రకూ ఈడూజోడూ బాగుంటుందని భ్రమరాంబకు అనిపించింది. పిల్లలిద్దరూ యిష్టపడితే ఈ పెళ్ళి తనకు నచ్చగలదని ఆవిడ నమ్మకం. ముందుగా నరేంద్ర అభిప్రాయం తెలుసుకుందుకామె లక్ష్మి అవలంబించిన పద్ధతినే అనుసరించింది.

ఒక రోజామె నరేంద్రతో వనజ గురించి చెప్పుకుని వాపోయి–"దాని పెళ్ళి గురించి నాకు చాలా బెంగగా ఉంది" అంది.

నరేంద్ర వెంటనే-"అత్తయ్యా-ఈ రోజుల్లో ఆడపిల్లలంతా యింతే! మారుతున్న కాలమిది. మా దొడ్డమ్మకు పాపం-నలుగురు పిల్లలు. నలుగురూ ఆడపిల్లలే! వాళ్ళు నలుగుర్నీ ఆమె మగపిల్లల్లాగే పెంచింది. వాళ్ళకు బాగా ఆస్తివుంది. వాళ్ళెంత తెలివైన వాళ్ళనుకున్నావ్! ఒకర్తి వ్యవసాయం చూస్తుంది. ఇంకొకర్తి వ్యాపారం. ఇంకొకర్తేమో కథ వ్రాస్తోంది. ఒకర్తికి ఉద్యోగం. నలుగురికీ పెళ్ళిళ్ళైపోయాయి. సుఖంగా కాపురాలు చేసుకుంటున్నారు" అన్నాడు.

"అందరికీ అంత అదృష్టముండొద్దూ"–అని నిట్టూర్చింది భ్రమరాంబ.

"నా మాట విని వనజను నాలాంటి వ్యాపారస్థుడికిచ్చి పెళ్ళిచేసేయ్. అప్పుడామెకు మహిళా సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు బోలెడు తీరుబడి. ఇంట్లో వంట పనేకాదు, ఏ పనులూ ఉండవు...." అన్నాడు నరేంద్ర.

నరేంద్ర వనజంటే యిష్టపడుతున్నట్లు భ్రమరాంబ అర్థం చేసుకుని విషయం రామారావుకు చెప్పింది.

"ఇంకేం-అమ్మాయి అభిప్రాయం కూడా అడుగు" అన్నాడు రామారావు.

దాన్నడగాలంటే కాదనేస్తుందని భయంగా ఉందండీ" అంది భ్రమరాంబ.

రామారావుగారికీ ఈ విషయంలో భయంగా ఉంది. అయినప్పటికీ తప్పదు కదా!

ఒకరోజున ఆయన వనజను పిలిచి "అమ్మా! వనజా! నువ్వు చిన్నదానివి. నీకు తెలివి ఉంది, ఆదర్శాలున్నాయి, ఆశయాలున్నాయి. వీటికి అనుభవం కూడా జతపడితే తప్ప నీకు ప్రపంచం అర్థంకాదు. నరేంద్రను పెళ్ళిచేసుకుంటే అన్నివిధాలా నువ్వు సుఖపడతావని నా అనుభవం చెబుతోంది. నువ్వంటే తనకి యిష్టమని అతడమ్మకు చెప్పాడు. కావాలంటే నువ్వూ మాట్లాడి తెలుసుకోవచ్చు..." అన్నాడు.

"అవసరంలేదు. నరేంద్ర అమ్మతో మాట్లాడుతున్నప్పుడు నేనక్కడలేను. కానీ, నేనామాటలు విన్నాను..." అంది వనజ.

"అయితే నీ అభిప్రాయం చెప్పు..."

"అతడంటే నాకిష్టంలేదు..." అని వెంటనే అక్కణ్ణించి వెళ్ళిపోయింది వనజ. రామారావుకేంచేయాలో తెలియలేదు.

"దీనికి పెళ్ళికుదరడం కష్టమని అప్పట్లో అనుకున్నాం. కానీ దీన్ని ఒప్పించడమే అసలు ఇబ్బందని ఇప్పుడు తెలుస్తోంది." అంది భ్రమరాంబ విషయం విన్నాక.

నరేంద్ర ఆ గదిలో మొత్తం పదివారాలున్నాడు. వెళ్ళిపోయేటప్పుడు అతడు రామారావు, భ్రమరాంబ, వనజలకు బట్టలు పెట్టాడు. అడ్రసిచ్చి తనకు ఉత్తరాలు రాస్తూండమన్నాడు. అతడడ్రసిచ్చింది వనజకోసమేనని అందరికీ అర్థమయింది.

రోజులు గడుస్తున్నాయి.

నరేంద్రనుంచి ఒక ఉత్తరం వచ్చింది. "మీ ఊళ్ళో నా అనుభవాలు విని మా నాన్నగారెంతో సంతోషించారు. మనమంతా మళ్ళీ ఇదివరకటిలా దగ్గర కావాలన్నదే మా నాన్నగారి కోరికలు..." అన్న వాక్యాలు ముఖ్యంగా భ్రమరాంబని ఆకర్షించాయి. అవామె రామారావుగారికి చూపిస్తే "ఏంచేస్తాం? దాని అదృష్టమెలాగుందో..." అన్నాడాయన.

ఒకరోజున భ్రమరాంబ పక్కింటి పంకజం కూతురు వేణి తనకొడుక్కి మొదటి పుట్టినరోజు వేడుక జరుపుకుంటూ పేరంటానికి పిలవడానికి వనజను సాయంగా రమ్మంది. వనజ అంగీకరించింది.

వేణి, వనజ ఒకే ఈడువాళ్ళు. వాళ్ళిద్దరూ కలిసి వెళుతూంటే, "పెళ్ళయితే ఈ పాటికి వనజ కూడా ఓ బిడ్డ తల్లయుండేది." అనుకుని నిట్టూర్చింది భ్రమరాంబ.

పిలుపులావీధిలోనే కాదు. ఊళ్ళో ఇంకా కొందరు తెలిసినవాళ్ళింటికి రిక్షామీద వెళ్ళారు వేణి, వనజ.

ఇల్లు వదిలిన నాలుగు గంటలకు మళ్ళీ తిరిగి వచ్చింది వనజ. ఆమె ముఖంలో కొత్త సంతోషముంది.

"ఏం జరిగిందే?" అంది భ్రమరాంబ ఆశ్చర్యంగా.

"అమ్మా! ఒక్క ముక్కతో చెబుతాను. కామేశ్వరిగారు తెలుసు కదా నేను వాళ్ళబ్బాయి సుబ్బారావును నేను పెళ్ళిచేసుకుంటాను," అంది వనజ.

వనజ ఏం చెప్పినా అలా కుండబద్దలు కొట్టినట్లే చెబుతుందని భ్రమరాంబకు తెలుసు. అయినా ఆవిడ ఆశ్చర్యపడింది.

సుబ్బారావు గురించి ఆమెకు తెలుసు. కుర్రాడు పీలగా ఉంటాడు. పెద్దగా అందగాడు కాదు. మూడేళ్ళక్రితం వాళ్ళీ ఊరు వచ్చారు. మంచి కలుపుగోలు మనుషులు. సుబ్బారావు బీయస్సీ ప్యాసయ్యాడు. బ్యాంకులో ఉద్యోగం. తండ్రి రిటైరైపోయాడు. తల్లీ తండ్రీ ప్రస్తుతం అతడితోనే ఉంటున్నారు. అతడి ఉద్యోగరీత్యానే వారీ ఊరొచ్చారు.

కుర్రాడికి పెద్దగా చదువులేదు. ఉద్యోగం మంచిదే కానీ అందగాడుకాదు. విధిగా అత్తమామలతో కలిసి ఉండాలి. చూసిచూసి వనజ ఈ సంబంధం ఎన్నుకుందా?

భ్రమరాంబ భర్తకీ విషయం చెప్పింది. అదివిని రామారావు కూడా ఆశ్చర్యపడినా, "అదిష్టపడిందిగా అంతకంటే మనకేం కావాలి?" అన్నాడు.

ఒక మంచి రోజు చూసుకుని ఆ దంపతులు సుబ్బారావింటికి వెళ్ళారు. ఇంట్లో సుబ్బారావు తల్లి కామేశ్వరి, తండ్రి జగన్నాథం ఉన్నారు. వాళ్ళు రామారావు దంపతులు వచ్చిన పని విని-"మీ పిల్లకు వంటా వార్పూ వచ్చా?" అనడిగారు.

కామేశ్వరికింటిపని చేసుకోవడం కష్టంగా ఉందనేవాళ్ళు సుబ్బారావు పెళ్ళికి తొందరపడుతున్నారు. లేకుంటే వాళ్ళకు కొన్ని అప్పులు కూడా ఉన్నాయి. అవి తీరేదాకా పెళ్ళిచేసుకోవడం సుబ్బారావుకిష్టంలేదు.

అంతేకాదు-వాళ్ళు కట్నం కూడా ఆశిస్తున్నారు.

ఒక విధంగా ఇదీ మంచిదేననుకున్నాడు రామారావు. ఈ విషయం వింటే వనజ మండిపడి సంబంధం వద్దంటుంది. ఈ సంబంధమాయనకు నచ్చలేదు.

రామారావు దంపతులక్కడ సెలవు తీసుకుని ఇంటికి వచ్చి వనజకు విషయం చెబితే "దాందేముంది? అవసరమైతే వంట నేర్చుకుంటాను...." అంది,

"ఏమే, తల్లి నీకు చేదయిందా అత్త బంగారమైందా?" అంది భ్రమరాంబ.

"నీకిష్టం లేకపోతేసరి నా యిష్టం చెప్పాను" అంది వనజ.

వచ్చిన ఈ అవకాశం వదులుకోలేదు రామారావు.

పెళ్ళిచూపులు ఏర్పాటయ్యాయి.

చూపుల సమయంలో కామేశ్వరి "సంతలో పశువులా ఆడపిల్లను పరీక్షించడం నాకు నచ్చదు. అబ్బాయినీ, అమ్మాయినీ కాసేపు విడిగా మాట్లాడుకోనివ్వండి. వాళ్ళిద్దరూ యిష్టపడితే మన యిష్టానిదేముంది? నిమిత్తమాత్రులం" అంది.

సుబ్బారావు, వనజ ఓ గదిలో విడిగా ఉన్నారు.

సుబ్బారావామెలో సూటిగా "నేనంటే మీ కిష్టమేనా?" అన్నాడు.

"ఈ సంబంధాన్ని నేనే మా వాళ్ళకు సూచించాను. నా బలవంతంమీదే అన్ని ఏర్పాట్లూ జరుగుతున్నాయి" అంది వనజ.

"ఎందుకని?" అన్నాడు సుబ్బారావు ఆశ్చర్యంగా.

వనజ మాట్లాడలేదు.

"మనకు చెప్పుకోదగ్గ పూర్వ పరిచయంలేదు" అన్నాడతడు మళ్ళీ.

"బంగారం స్వచ్ఛత తెలుసుకుందుకు కొద్ది క్షణాలు చాలు. అందుకు గీటురాయుంటుంది. మనుషుల సంస్కారం తెలుసుకునే గీటురాయి నావద్ద ఉంది."

సుబ్బారావు తల వంచుకుని "నేనంత సంస్కారవంతుణ్ణి కాదు. మీనుండి కట్నం ఆశిస్తున్నాను" అన్నాడు.

"కట్నం తీసుకోవడం తప్పనీ, అదొక ఆడపిల్లనవమానించడమనీ మీకు తెలియదా?" అంది వనజ.

"తెలుసు. కానీ నా తల్లి కూడా ఆడది. ఆమెపై గౌరవంతో కట్నం తీసుకుందుకు నేనంగీకరించాల్సివచ్చింది" అన్నాడు సుబ్బారావు.

"కొడుకు శీలం తల్లి సంస్కారంపై ఆధారపడి ఉంటుంది. కట్నం తీసుకోవాలనుకుంటున్న మీ తల్లి సంస్కారం మీకు అవమానంగా అనిపించడంలేదా?" అంది వనజ.

"మీరు నమ్ముతారో, లేదో అమ్మ కూడా అవమానంగానే ఫీలవుతోంది. నాన్నయితే సిగ్గుపడుతున్నాడు. కానీ ఒకోసారి అంతే! ఇంతకన్న వివరంగా చెప్పలేను."

వనజ జాలిగా అతడివేపు చూసి "మీ యింట్లో అందరి సంస్కారాన్నీ నేను నమ్ముతాను. అందుకు ముందుగా నా గురించి మీరు తెలుసుకోవాలి" అంటూ తానేవిధంగా పెరిగిందీ చెప్పింది.

సుబ్బారావు తెల్లబోయి "మీకు వంట రాకపోతే ఎలా? అమ్మకు సాయం కావాలి" అన్నాడు.

వనజ నవ్వి "ఇంట్లో ఒకరికొకరు సాయంగా ఉండడంలో తప్పులేదు. నేను అన్నీ నేర్చుకుంటాను. అయితే నాకూ ఉద్యోగం వస్తే అప్పుడూ నేవంటింట్లో మీ అమ్మగారికి సాయం చేయాలా? వంటమనిషిని పెట్టుకోవచ్చా?" అనడిగింది.

"అమ్మకక్కావలసింది సాయం. మీ సాయం కాదు."

"థాంక్స్!" అని "నేనూ ఉద్యోగం చేస్తే వేణ్ణీళ్ళకు చన్నీళ్ళలా సాయంగా ఉంటుంది" అంది వనజ.

"కానీ నాకది యిష్టంలేదు" అన్నాడు సుబ్బారావు.

"ఎందుకని?" అంది వనజ.

"నిజం చెబుతున్నాను. సంసారాన్ని సరిదిద్దుకోవడంలో స్త్రీకి వేరెవ్వరూ సాటిరారు. గృహిణిగా స్త్రీ నిర్వహించే ఉద్యోగ బాధ్యతలను ఏ జీతంలోనూ వెలకట్టలేము. అంత విలువైన సేవాభాగ్యాన్ని రవంత అదనపు ఆదాయంకోసం త్యాగం చేయలేను నేను. నాకు స్వర్గంలాంటి ఇల్లు కావాలి. పూరిగుడిసెలోనైనా స్వర్గం చూపించగల ఇల్లాలు కావాలి. అటువంటి సంసారంకోసం అవసరమైన సంపాదనకు నా ఒక్కడి కష్టం చాలు" అని "నేను అత్యంత సామాన్యుణ్ణి. నా భావాలు మీకు నచ్చుతాయో, లేవో" అన్నాడు సుబ్బారావు.

"మళ్ళీ చెబుతున్నాను. మీ కుటుంబం సంస్కారానికి నేను ముగ్ధురాలనయ్యాను" అంది వనజ.

"మా సంస్కారంతో మీ కంత పరిచయమేముంది?" అన్నాడు సుబ్బారావు.

"ఆ మధ్య ఒకరోజున మీ యింటికి పేరంటం పిలుపుకు వచ్చాను. అప్పుడు మీ యింట్లో అంతా దిగులుగా ఉన్నారు. విషయమేమిటంటే ఆ రోజే మీకు మీ అన్నగారి దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది. మీ వదినగారికి మూడవ కాన్పులో కూడా మగపిల్లాడే పుట్టాడు. ఏదో ఘోరం జరిగినట్లు మీరంతా బాధపడుతున్నారు. ఈసారైనా ఆడపిల్ల పుట్టలేదని పదేపదే అనుకున్నారు. మళ్ళీ ఆడపిల్లేనా అని అందరూ అనుకునే ఈ రోజుల్లో మళ్ళీ మగపిల్లాడేనా అని బాధపడగల సంస్కారవంతుల పరిచయం కోసమే నేను ఎదురుచూస్తున్నాను. గతంలోనూ నాన్నగారు నాకు రెండు సంబంధాలు చూశారు. ఒకదేమో-పాపం-మా అన్నయ్యకిద్దరూ కూతుళ్ళే అన్నాడు. ఇంకొకదేమో-మా దొడ్డమ్మకు-పాపం-నలుగురాడపిల్లలు-అన్నాడు. మాటల్లో వాళ్ళెంతో సంస్కారం చూపించారు. ఆడదానికెంతో విలువ నిస్తామన్నారు. కానీ ఆడపిల్లలున్న తలిదండ్రుల గురించి-'పాపం' అన్న మాట ముందుగా వాడడంలో వాళ్ళ సంస్కారం అప్రయత్నంగానే బయటపడిపోయింది. అందుకే మీ యింట్లోని మాటలు-అమృతోపమానంగా తోచాయి. అవసరం కొద్దీ మీరు కొన్ని తప్పులు చేయవచ్చు. కానీ మీ యింట్లో జన్మతః మా యింట్లో కూడా లేని సంస్కారముంది" అంది వనజ.

సుబ్బారావామె వంక ఆశ్చర్యంగా చూశాడు.

అప్పుడు వనజ కళ్ళలో గూడుకట్టుకున్న ఆవేదనను చూశాడతడు.

అతడికి తెలుసు.

"అయ్యో-పాపం-ఆడపిల్ల పుట్టిందట...."

"ఏమిటీ-మళ్ళీ ఆడపిల్లేనా?"

"ఆడపిల్లా-ఎవరి దురదృష్టాన్నెవరు తప్పించగలరు?"

"ఈ దౌర్భాగ్యపు మొహానికి మగపిల్లాడు కూడానా?"

"ఇట్సాలైర్రైట్ బ్రదర్-ఆడపిల్ల పుట్టిందని దిగులుపడకు. నెక్స్టు టైమ్ బెటర్ లక్!"

"ముగ్గురాడపిల్లలైతే మాత్రం-అప్పుడే ఆపరేషన్ చేయించేసుకుంటారా? ఇంకో ఛాన్సు చూడండి...."

ఎందరిళ్ళలోనో ఆడ-మగ, పిల్లా-పెద్దా అంతా అతి సాధారణంగా అనుకునే ఈ మాటలు కాస్త ఆలోచించగల ఒక ఆడపిల్ల మనసు నెంతగా దెబ్బతీస్తాయో సుబ్బారావు కాక్షణంలో తెలిసింది.

"వనజా! మీరు ముగ్ధులైన నా సంస్కారాన్ని తప్పక నిలబెట్టుకుంటాను. మీకు నేను నచ్చితే నా అదృష్టం. కానీ మిమ్మల్ని పొందేటంత అదృష్టం నాకుందో లేదో-మీరే తేల్చి చెప్పాలి...." అన్నాడు సుబ్బారావు.

"థాంక్స్!" అంది వనజ.

"అబ్బాయికి నువ్వు నచ్చావుటమ్మా!" అన్నదా రాత్రి భ్రమరాంబ వనజతో.

మర్నాడు వనజ పరీక్ష ఫలితాలు వచ్చాయి. ఆమె బి.యస్సీ ఫస్టుక్లాసులో ప్యాసయింది.

"వనజ పరీక్షల్లో తప్పదు" అనుకున్నాడు రామారావు. □